క్లుప్తంగా

మండలాభివృద్ధికి నిధులు కేటాయించాలి



మంత్రిని కలిసి సన్మానిస్తున్న ప్రదీప్‌రావు

జగిత్యాల: బీర్‌పూర్ మండల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, బీర్‌పూర్ ఆలయ మాజీ చైర్మన్ గోనె ప్రదీప్‌రావు సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మంత్రిని కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం బీర్‌పూర్‌ను మండల కేంద్రంగా ప్రకటించడంతో ఇప్పుడిప్పుడే అభివృద్ధి దిశలో పయనిస్తోందని, దీనికి తోడు మండలానికి మరిన్ని నిధులు కేటాయిస్తే మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాల నిర్మాణాలు జరుగుతాయని, దీంతో అభివృద్ధి మరింత వేగంగా సాగుతుందన్నారు.

పోస్టల్ పథకాలపై గ్రామాల్లో అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోస్టల్ అధికారులు

ఇబ్రహీంపట్నం: భారతీయ పోస్టల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పథకాలపై పోస్టల్ అధికారులు ఆదివారం మండలంలోని గోదూర్, తిమ్మాపూర్, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్, వేములకుర్తి, బర్దీపూర్, మాలరాంపూర్, ఎర్దండి, కోమటికొండాపూర్, ఇబ్రహీంపట్నం గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొత్త వడ్డీ రేట్లతో డిపాజిట్ల సేకరణ, లక్ష ఖాతాలు తెరవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బ్రాంచ్ పోస్టుమాస్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞాన విహారయాత్రలో విద్యార్థులు



వెయ్యి స్తంభాల ఆలయం వద్ద విద్యార్థులు

రాయికల్: మండలంలోని ఒడ్డెరకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రముఖ చారిత్రక దేవాలయం సందర్శించారు. వాటి విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

గ్రామాల్లో కుక్కల బెడద



కూడలి వద్ద గుంపుగా ఉన్న కుక్కలు

కథలాపూర్: మండలంలోని సిరికొండ, భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు పేర్కొన్నారు. గ్రామకూడళ్ల వద్ద కుక్కలు గుంపుగా ఉండి రాత్రివేళల్లో బైకులపై వెళ్లేవారిని వెంబడించి గాయపరుస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు చొరవ చూపి గ్రామాల్లో కుక్కల బెడద నుంచి కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జిల్లా భట్రాజు సంఘం నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా భట్రాజు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గణపతి నరేందర్‌రాజు, ఉపాధ్యక్షులుగా నన్నపునేని విశ్వప్రసాద్‌రాజు, బ్రహ్మాండవేని వేణుగోపాలరాజు, హరిదాసు లింబాద్రి, బిరుదరాజు ప్రవీణ, దేవరాజు సత్యరాజు, ప్రధాన కార్యదర్శిగా కొత్తపేట సంజయ్‌రాజు, కోశాధికారిగా ఈలపంటి వేణుగోపాలరాజు, సహాయ కార్యదర్శులుగా కాసు క్రాంతికుమార్ రాజు, బిరుదురాజు సుభాష్‌రాజు, నన్నపురాజు సురేందర్, అడ్లూరి హరిణి, కార్యదర్శిగా బ్రహ్మాండభేరి నరేశ్ రాజుతో పాటు తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- ఊరికి దూరంగా ఏర్పాటు చేసిన వైనం
- ఆసక్తి చూపని క్రీడాకారులు
- నిర్వహణ లేక ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు



పెగడపల్లిలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

పెగడపల్లి: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికి తీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలని ప్రభుత్వం పల్లెల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ మైదానాలు గ్రామాలకు దూరంగా ఉండటంతో పాటు నిర్వహణ లేక పిచ్చిమొక్కలు పెరిగి చెత్త చెదారంతో నిండాయి.

మండలంలో 20 నిర్మాణాలు..

పంచాయతీకి ఒక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మండలంలో 23 పంచాయతీలుండగా 20 పంచాయతీల వరకు వీటి నిర్మాణం పూర్తయ్యాయి. ఏర్పాటు చేసిన చోట అందుబాటులో స్థలాన్ని బట్టితి రూ.50 వేల నుంచి రూ.4 వరకు ఖర్చు చేశారు. ఈ మైదానాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆటలతో పాటు వ్యాయామం చేసుకునేందుకు, అలాగే ఆ పంచాయతీ పరిధిలోని విద్యార్థులు, యువకులు, క్రీడలు ఆడుకోవడమే ప్రభుత్వ లక్ష్యం. కానీ యువత, విద్యార్థులు వీటిని వినియోగించుకోవడం లేదు. కారణం ఊరికి దూరంగా ఉండటం, నేర్పించే శిక్షకుడు లేకపోవడం. మండలంలోని చాలా గ్రామాల్లో ఈ మైదానాలు ఊరికి దూరంగా ఏర్పాటు చేశారు. దీంతో ఈ మైదానాలు నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో శిక్షకులను ఏర్పాటు చేస్తే యువకులు, విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. ఫలితంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలకు సార్థకత లభిస్తుందని మండలంలోని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

ఆసక్తి చూపడం లేదు

మండలంలోని చాలా గ్రామాల్లో క్రీడా మైదానాలు ఊరికి దూరంగా ఉన్నాయి. దూరంగా ఉండటంతో విద్యార్థులు, యువకులు అక్కడి వరకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. కొన్ని గ్రామాల్లో పాఠశాలల్లో, గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన వాటిని విద్యార్థులు, యువకులు ఉపయోగించుకుంటున్నారు.

– పుల్లయ్య, ఎంపీడీవో

ఏసీడీ చార్జీలు చట్ట విరుద్ధం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: రాష్ట్రంలో ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు ఉన్నాయి. ఇందులో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ మాత్రమే వినియోగదారుల నుంచి ఏసీడీ చార్జీలు వసూలు చేయడం సరికాదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఇందిరాభవన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నష్టాల ఊబిలో కూరుకుపోయిన విద్యుత్ పంపిణీ సంస్థలను గట్టెక్కించేందుకు ఏసీడీ చార్జీలను తెరపైకి తెచ్చారని, పేదలపై ఆర్థికభారం వేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో 500యూనిట్లకు పైగా వినియోగించే వారినుంచే ఏసీడీ చార్జీలు వసూలు చేసేవారని, ప్రస్తుతం 300యూనిట్ల లోపు వినియోగించే బడుగు, బలహీన, దళిత, మైనార్టీలపై భారం మోపడం దారుణమన్నారు. 24గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని రాష్ట్రప్రభుత్వం నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఆయన సవాల్ చేశారు. ఏసీడీ చార్జీలను నిరసిస్తూ ఈనెల 31న జగిత్యాల సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తామని, దీనిని విజయవంతం చేయాలని ఆయన కోరారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు గాజుల రాజేందర్, కళ్లెపెల్లి దుర్గయ్య, బండ శంకర్, కొత్త మోహన్, గాజంగి నందయ్య, పుప్పాల అశోక్, చందా రాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతులకు మద్దతు ఏదీ?

ఇబ్రహీంపట్నం: పసుపు రైతులకు మద్దతు ధర కల్పించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. టీపీసీసీ నాయకుడు జువ్వాడి నర్సింగరావుతో కలిసి ఆయన పసుపు పంట పరిశీలించారు. పసుపు బోర్డు తెస్తానన్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్ మద్దతు ధర కూడా తేలేక పోయారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, మెటుపల్లి పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు దేశానికే ఆదర్శం



యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకం దేశానికే ఆదర్శమని, ఈ పథకంతో దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని 15వ వార్డులో దళితబంధు పథకం ద్వారా మంజూరైన బుక్‌డిపో, స్టేషనరీ షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఒక్క రూపాయి కూడా బ్యాంకు లోన్ లింకేజ్ లేకుండా మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే రూ.10లక్షలు నేరుగా దళితుల అకౌంట్లో జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. దళితులు వారు కోరుకున్న రంగాల్లో ఎదిగేందుకు మంచి యూనిట్లను ఎంచుకుని ఆర్థిక సాధికారత సాధించాలని ఆకాంక్షించారు. ప్రతిపక్ష నాయకుల అసత్య ప్రచారాలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూమి కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి మున్నూరుకాపు కుల సంఘం భవనం, కల్యాణ మండపానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులసంఘ భవన నిర్మాణాలకు ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, రాజిరెడ్డి, లక్ష్మన్, మహేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల కోసం రూ.500 కోట్లు కేటాయించాలి



సంఘీభావం ప్రకటిస్తున్న ప్రతినిధులు

రాయికల్: వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రవాసీల సంక్షేమం కోసం ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలు చేసి రూ.500 కోట్లు కేటాయించాలని దుబాయ్‌లోని గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బార్ దుబాయ్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రవాసీ సంక్షేమ బోర్డు సాధనకై కోటపాట నర్సింహనాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గల్ఫ్ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రవాసీ సంక్షేమం కోసం ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు, రూ.500 కోట్లు సంక్షేమ నిధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతినిధులు జంగం బాలకిషన్, పాతకూరి తిరుపతిరెడ్డి, జువ్వాడి శ్రీనివాస్‌రావు, కట్కం రవి, గుండెల్లి నర్సింహులు, ఊట్నూరి రవి, భవాని బాపురావు, వంశీగౌడ్, మదన్ పాల్గొన్నారు.

అవకతవకలపై చర్యలేవీ?

- ఉపాధిహామీ సామాజిక తనిఖీలకు కసరత్తు
- మండలంలో రూ. 9.14 కోట్ల పనులపై ఫిబ్రవరి 3వ తేదీ నుంచి తనిఖీ



చింతకుంట శివారులో గుట్ట వద్ద రూ.2 లక్షలతో నిర్మించిన డాగౌట్ ఫాండ్ (ఫైల్)

కథలాపూర్: ఉపాధిహామీ పథకంలో కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో రూ.లక్షలు వెచ్చించి గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేస్తూ ఏడాది తర్వాత సామాజిక తనిఖీ నిర్వహించడం సహజం. కానీ సామాజిక తనిఖీల్లో అవకతవకలు వెలుగులోకి వచ్చినప్పటికీ తాత్కలికంగా నోటీసులు ఇచ్చి ఆ తర్వాత పట్టించుకోవడంలేదని విమర్శలున్నాయి. పలు గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులు మాయమైనప్పటికీ చర్యలు తీసుకోలేదనే ఆరోపణలున్నాయి. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి కథలాపూర్ మండలంలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నందున ఈసారైనా వెలుగులోకి వచ్చిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మండలంలో రూ.9.14 కోట్ల పనులపై తనిఖీలు

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలున్నాయి. ఉపాధిహామీ పథకంలో మండలంలో ఫిబ్రవరి 2020 నుంచి మార్చి 2022 వరకు రూ.9.14 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశారు. ఇందులో రూ.2.12 కోట్లు మెటీరియల్ వెచ్చించి పనులు చేపట్టారు. మిగతా రూ.6.91 కోట్ల పనులు కూలీలతో చేయించారు. ఈ పనులకు వచ్చే నెల 3 నుంచి సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారులు ప్రకటించారు. కాగా రెండేళ్లుగా ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులు కొన్ని గ్రామాల్లో మాయమైనట్లు ప్రజల పేర్కొంటున్నారు. సామాజిక తనిఖీల్లో మాయమైన అభివృద్ధి పనులను గుర్తించి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలున్నాయి. చిన్న తప్పులను గుర్తించి ఉపాధిహామీ సిబ్బందికి జరిమానా విధిస్తూ.. పెద్ద తప్పులను వదిలేయడంతో సామాజిక తనిఖీలపై ప్రజల్లో విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి. వచ్చే నెల 3 నుంచి నిర్వహించే ఉపాధిహామీ పథకం 13వ విడత సామాజిక తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన అక్రమాలన్నింటిపై చర్యలు తీసుకొని సామాజిక తనిఖీలపై నమ్మకం కలిగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సకాలంలో వేతనాలు ఇవ్వాలి



ఉపాధిహామీ పథకంలో పేద ప్రజలు ఎండలో, వానలో కష్టపడి పనిచేస్తున్నారు. వారికి సకాలంలో వేతనాలు ఇవ్వాలి. ఉపాధిహామీ పథకంలో చేసిన పనులను దుర్వినియోగం చేయడం దారుణం. పాలకులు, అధికారులు బాధ్యతగా భావించాలి. ఎంతటివారైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలి. – బాలె నీలకంఠం, బీఎస్పీ నియోజకవర్గ నేత

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో సామాజిక తనిఖీలను రిసోర్స్ పర్సన్లతో పకడ్బందీగా నిర్వహిస్తాం. గ్రామసభలు నిర్వహించి చర్చిస్తాం. తనిఖీల్లో వెలుగుచూసిన అక్రమాలపై చర్యలు తీసుకుంటాం. మొదటగా నోటీసులిస్తాం. స్పందించకపోతే ఉపాధిహామీ చట్టం ప్రకారం బాధ్యులపై చర్యలుంటాయి.

– చిన్నయ్య, ఉపాధిహామీ పథకం విజిలెన్స్ అధికారి

యాసంగి కోసం ఎత్తిపోతలు పునఃప్రారంభించాం



ఎత్తిపోతలను ప్రారంభిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మపురి: ఈ యాసంగిలో సాగుచేసే పంటలకు ఎత్తిపోతలు పునఃప్రారంభించామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. భారీ వర్షాలు, వరదలతో గోదావరి తీరంలోని ఎత్తిపోతలు దెబ్బతిన్నాయి. వీటిని మరమ్మతులు చేయడానికి మంత్రి రూ.50లక్షల చొప్పున మంజూరు చేశారు. ఈ నిధులు వెచ్చించి పునరుద్ధరించిన రాజారం ఎత్తిపోతల పథకాన్ని మంత్రి ఈశ్వర్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఎత్తిపోతల పథకాలు వరదలతో దెబ్బతిన్నాయని, పంటలు పండించుకునే వీలులేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారిని ఆదుకోవడానికి ఎత్తిపోతలకు మరమ్మతులు చేయించి పునఃప్రారంభించామని తెలిపారు. రైతు సంక్షమం కోసం ప్రభుత్వం ఎల్లావేళలా కృషి చేస్తోందని ఆయన అన్నారు. అనంతరం గ్రామంలో కొత్తగా నిర్మించిన సాయిబాబా దేవాలయంలో మంత్రి పూజలు చేశారు. దమ్మన్నపేటలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈకార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, సర్పంచ్ లహరిక, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు భీమన్న తదితరులు పాల్గొన్నారు.

సంఘం భవన నిర్మాణానికి నిధులు

పెగడపల్లి: పెగడపల్లి రెడ్డి సంక్షేమ సంఘం భవన నిర్మాణం కోసం రూ.10 లక్షలను సంక్షేమశాఖ మంత్రి ఈశ్వర్ మంజూరు చేశారు. ఈమేరకు ప్రొసీడింగ్స్ కాపీని కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో రెడ్డి సంఘం ప్రతినిధులకు మంత్రి అందజేశారు. సంఘం అధ్యక్షుడు కాటం నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎన్‌రెడ్డి సత్యనారాయణరెడ్డి, దామోదర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంకృష్ణారెడ్డి, వంశీధర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రామ్‌సురేశ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వీరారెడ్డి, తిరుపతిరెడ్డి, మధూకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

గొల్లపల్లి: రాఘవపట్నం మున్నూరుకాపు సంఘం భవన నిర్మాణానికి రూ.5 లక్షలు, రెడ్డి సంక్షేమ సంఘం భవనం గోడ నిర్మాణానికి రూ.5 లక్షల ప్రొసీడింగ్స్ కాపీని మంత్రి కొప్పుల ఈశ్వర్ సంఘ సభ్యులకు అందజేశారు. ఎంపీటీసీ మధూకర్‌రెడ్డి, నాయకులు ఓరుగంటి అశోక్‌రావు, జలేందర్, బాలభక్తుల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ నేడు దుకాణాల ఏర్పాటుకు వేలం

పెగడపల్లి: పెగడపల్లిలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా దకాణాల ఏర్పాటు కోసం 30న సోమవారం ఆలయం ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమాడి గంగారెడ్డి, బైర పోచయ్య ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు వేలం జరుగుతుందని, ఆసక్తి గల ఔత్సాహికులు పాల్గొనాలని కోరారు. టెంకాయ, లడ్డు, పులిహోర విక్రయాల కోసం వేలం నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

✦ అనాథల అరిగోస దీక్షకు తరలిరండి

కథలాపూర్: హైదరాబాద్‌లో సోమవారం జరిగే అనాథల అరిగోస దీక్షకు కథలాపూర్, మేడిపెల్లి, కోరుట్ల మండలాల నుంచి అభిమానులు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ కాశవత్తుల లక్ష్మీరాజం కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షకు అధిక సంఖ్యలో అనాథలు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు వచ్చి విజయవంతం చేయాలన్నారు.

✦ వాకర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షునిగా భూమాగౌడ్

రాయికల్: పట్టణ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బొంగోని భూమాగౌడ్, ఉపాధ్యక్షుడిగా నాగిరెడ్డి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జోగ గంగరాజం, కోశాధికారిగా గజ్జి వేణు, కార్యవర్గ సభ్యులుగా కడకుంట్ల మనోహర్, పాన్నం రమేశ్‌గౌడ్, గుర్రాల ప్రసాద్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

✦ అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి: మండలంలోని వేంపేటలో అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మ్యాదరి అనిల్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా మగ్గిడి ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా బింగి సాయికిరీటి, ప్రధాన కార్యదర్శిగా మగ్గిడి అఖి, కోశాధికారిగా గన్యారపు హరీశ్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గన్యారపు శ్రీనివాస్, బింగి శ్రీనివాస్, రాజేందర్, వెంకటేశ్, కల్యాణ్, ప్రవీణ్, మురళి పాల్గొన్నారు.

మల్లన్నస్వామి జాతర

కోరుట్లరూరల్: సంగెం మల్లన్నస్వామి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మల్లన్న పట్నాలు వేశారు. బోనాలతో నైవేద్యం సమర్పించారు.

మల్లేశ్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్



పురస్కారం ప్రదానం చేస్తున్న ప్రతినిధులు

మల్లాపూర్: తెలంగాణ జాగృతి యువత అధ్యక్షుడు గనవేని మల్లేశ్‌కు జీవిత సాఫల్య జాతీయ పురస్కారం ప్రదానం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేశారు. సామాజిక సేవా కార్యక్రమాల విభాగంలో ఆయనకు పురస్కారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నాగరాజుకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నాగరాజు

కోరుట్ల: పట్టణానికి చెందిన కోరుట్ల సేవాదళ్ అధ్యక్షుడు పుప్పాల నాగరాజుకు యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ, హుస్నాబాద్ వారు ఆదివారం స్ఫూర్తి సేవా రత్న జాతీయ పురస్కారం ప్రదానం చేశారు. ఆయన సేవాదళ్ సంస్థ స్థాపించి పలువురి ద్వారా విరివిగా రక్తదానం చేయిస్తున్నారు. శుభకార్యాల్లో మిగిలిన ఆహారం సేకరించి పేదలకు అందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి ఈ పురస్కారం అందజేసినట్లు సంస్థ నిర్వాహకులు వెల్లడించారు.

ముస్తాబైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం

పెగడపల్లి: మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఫిబ్రవరి 1 నుంచి వైభవంగా జరిగే బ్రహ్మోత్సవాలకు శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాల్లో భాగంగా వచ్చేనెల 1న, స్వామివారి తిరుక్కల్యాణ మహోత్సవం, నందాదీప స్థాపన, 2న నిత్యహోమం, బలిహరణ, తీర్థ ప్రసాద వితరణ, కుంకుమార్చన, 3న హోమం, పంచామృతాభిషేకం, తీర్థ ప్రసాద వితరణ, 4న అన్నదానం, ఎడ్లబండ్ల పోటీలు, 5న రథహోమం, రథోత్సవం, ఏకాంతసేవ కార్యక్రమాలు జరగనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

విద్యుత్ అందించడానికి కృషి

మెట్‌పల్లి: పంటలు ఎండిపోకుండా విద్యుత్ అందించడానికి సంస్థ అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఏడీఈ మనోహర్ తెలిపారు. పదిరోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని, రైతులు ఆందోళన చెందవద్దని, తొందరలోనే సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కోరుట్ల: మండలంలోని నాగులపేట గ్రామంలో ఆదివారం రాష్ట్ర వంజరి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నాయకులు బొమ్మెల శంకర్, లక్ష్మీపతి, తుక్కారాం, ఆరె రాజగంగరాజం, సుధాకర్, లవంగ సాగర్, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

లక్ష్మీపూర్ క్రికెట్ కప్ విజేత ముత్యంపేట



షీల్డుతో ముత్యంపేట క్రికెట్ జట్టు

జగిత్యాలజోన్: జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్ క్రికెట్ లీగ్ కప్‌ను మల్యాల మండలం ముత్యంపేట గ్రామ జట్టు కైవసం చేసుకుంది. కాగా ఆదివారం లక్ష్మీపూర్‌లో జరిగిన కార్యక్రమంలో కప్‌తో పాటు రూ.30వేల ప్రైజ్ మనీని విజేత జట్టుకు కేతివేని ప్రశాంత్ స్మారకార్థం ఆయన తల్లి అందజేసింది. ద్వితీయ బహుమతి జగిత్యాలరూరల్ మండలంలోని జాబితాపూర్ జట్టు గెలుచుకుంది. రూ.15వేల ప్రైజ్‌మనీతో పాటు కప్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చెరుకు జాన్, బద్దం తిరుపతిరెడ్డి, నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, ఎడమల సత్యం, క్రికెట్ ఆర్గనైజర్ గర్వంద సృష్టి పాల్గొన్నారు.